క్లుప్తంగా

ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలి



మురుగు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

డోన్ టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను మురుగు కాలువలో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త బండ్లలో వేసి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ ప్రజలను కోరారు. శనివారం పట్టణంలోని 27వ వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు.

రెండు గడ్డివాముల దగ్ధం



బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురంలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు మద్దిలేటి, గోపాలుకు చెందిన గడ్డి వాములకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధ రాత్రి నిప్పు పెట్టడంతో కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.40 వేల నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ రైల్వే బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి(50) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనాథ వ్యక్తిగా గుర్తించిన పోలీసులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషాను కోరారు. ఈ మేరు సభ్యులతో కలిసి వన్నూర్ బాషా అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయాలి

డోన్ రూరల్ : రైతులకు సకాలంలో విత్తనాలు ఎరువులు అందచేయాలని సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, పట్టణ కార్యదర్శి నారాయణ, నాయకులు వరదరాజులు, హుసేన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నకిలీ విత్తనాల మూలంగా రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్ముతున్న ముఠాను కనిపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

బేతంచెర్ల: ఖరీఫ్ సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కార్యదర్శి భార్గవ్,నాయకులు తిరుమలేష్, దస్తగిరి, నాగరాజు, ఉదయ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని, ఇప్పటికైనా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ హక్కులను కాలరాస్తున్న కేంద్రం

డోన్ టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ధర్మారం రంగనాయకులు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దండకారణ్యంలో కగార్ పేరిట మోడీ ప్రభుత్వం నిర్వహిస్తున్న మారణహోమంపై నిజాలు పరిశీలించేందుకు వెళ్తున్న నిజనిర్ధారణ కమిటీ బృందాన్ని అడ్డుకోవటం దారుణం, అప్రజాస్వామికం అన్నారు. జనవరి 1 నుంచి అటవీ ప్రాంతాన్ని రక్త సిక్తం చేస్తోందని, వరుసగా బూటకపు ఎన్ కౌంటర్లకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ చర్యలను మా పార్టీ వ్యవతిరేకిస్తోందని తెలిపారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు మునీంద్ర, మాధులు, లక్ష్మన్న, చందు, బాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

బనగానపల్లె రూరల్ : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణ సమీపాన రవ్వలకొండపై వెలసిన ఆంజనేయస్వామి ఆలయం, కొండపేటలోని వెలసిన ఆంజనేయస్వామి, ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ఆకుపూజ అర్చన తదితర పూజలు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పుట్టలో వెలిసిన స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజ, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన భక్తుడు ప్రతాప్ ఆలయ గోడపై పెయింటింగ్‌తో స్వయంగా వేసిన భారీ ఆంజనేయస్వామి చిత్రం భక్తులను ఆకట్టుకుంటుంది. మీర్జాపురం పొలిమేర ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజల అనంతరం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీసెంటర్, బనగానపల్లె చౌరస్తా, పాటిమీద ఆంజనేయస్వామి, కోవెలకుంట్ల- నంద్యాల ఆర్అండ్‌బీ రహదారి పక్కన వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

సంజామల: మండలం కేంద్రం సంజామలతో పాటు గ్రామలల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముక్కమల్ల, ఆకుమల్ల, అల్వకొండ క్రాస్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల ఆవరణలో భక్తులు భజనలు చేశారు.

బనగానపల్లె : మండలంలోని పలుకూరు గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి గుండం శేషిరెడ్డి అభిషేకం, తమలపాకుల అర్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాఘవయ్య, నాగరాజుశెట్టి, జగదీశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కాటసాని పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకుతో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక రాజావీధిలో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారికి అత్యంత ప్రీతిదాయకమైన రోజు కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మార్కెట్ వెనుక ఏరియాలోని ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు పండ్ల వాయునంద గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



ఆంజనేయ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో గుండం ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన ఆంజనేయ స్వామి ఆలయం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



తీర్థప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



భజన చేస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న నాయకులు

ఆంజనేయస్వామికి పూజలు

డోన్ టౌన్ : ఆంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని శనివారం ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ సమీపంలోని కొండపై వెలసిన తిరుమల వీరాంజనేయస్వామి, ఇందిరానగర్ అభయాంజనేయస్వామి, ప్రభుత్వ ఐటీఐ ప్రక్కన వెలసిన ఆంజనేయస్వామి, పాతపేట రాములదేవాలయం తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతం, పంచామృత అభిషేకాలు, తులసీమాల, ఆకుపూజ, విశేషాలంకరణ, అర్చన, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అలాగే మడలంలోని గుమ్మకొండ గ్రామ సమీప కొండల్లో వెలసిన బంగారుకొండ పాతపాలెం అభయ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు ఆవులదొడ్డి సమీపంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపానున్న స్వామి మూల విరాట్‌లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిత్రం స్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల : మండలంలో హనుమాన్‌జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన ఆంజనేయస్వామి, గాడు బావి వీరాంజనేయ స్వామి, బుగ్గానిపల్లె రహదారిలోని పలకచింతమాను ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గోరిపేట ఆంజనేయస్వామి ఆలయంలో భజన కృష్ణయ్య ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. సిమెంట్ నగర్‌లో ఉపసర్పంచ్ అప్పా మమత, గ్రామ వైఎస్సార్ నాయకులు సత్యం ఆధ్వర్యంలో జరిగిన అభయాంజనేయస్వామి పూజా కార్యక్రమాల్లో పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ జీఎం రాఘవరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్యాపిలి: పట్టణంలోని కొప్పు అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి చిత్రపటానికి ప్రధాన వీధుల మీదగా గ్రామోత్సవం నిర్వహించారు.

కమనీయం..కంబగిరిస్వామి కల్యాణం



కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో వెలసిన విష్ణుకంటి క్షేత్రం 14వ వార్షిక మహోత్సవాలు ముగిశాయి. మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా జరిగిన మహోత్సవాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చివరిరోజు శనివారం క్షేత్రంలో కంబగిరి లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అంతకుముందు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమని కాటసాని జయమ్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నంద్యాల, నందికోట్కూరు, రాజంపేట, తాడిపత్రి తదితర పాంత్రాల నుంచి రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి ఉపాసకులు రామ్మోహన్ స్వామికి భక్తులు పూలభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై ఆశీనులుగావించి గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్ఐ రమేష్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

తప్పని పింఛన్ కష్టాలు

కొలిమిగుండ్ల: మూడు నెలల నుంచి పింఛన్ పొందాలంటే వృద్ధులు, దివ్యాంగులకు కష్టాలు తప్పడం లేదు. జూన్ నెలకు సంబంధించి శనివారం లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం పింఛన్ సొమ్ము జమ చేసింది. నగదు తీసుకునేందుకు... బ్యాంక్‌ల వద్దకు చేరుకునేందుకు వృద్ధులు పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. అంకిరెడ్డిపల్లెలో ఏపీజీబీ బ్యాంక్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఉండటంతో వృద్ధులు మెట్లు ఎక్కి దిగ లేక చాలా అవస్థలు ఎదుర్కొవాల్సి వచ్చింది. బ్యాంక్ ఖాతాల్లో జమకాని వారికి గ్రామ సచివాలయాల్లో అధికారులు నగదు అందజేశారు. బ్యాంక్‌లకు వెళ్లలే ని వారు ఆయా గ్రామాల్లో ఉన్న మినీ సెంటర్లకు వెళ్లి వెయ్యికి పది రూపాయలు కమిషన్ ఇచ్చి పింఛన్ సొమ్ము తెచ్చుకోవాల్సి వచ్చింది. వలంటీర్లు ఉన్న సమయంలో తెల్లవారు జామునే మాకు ఇంటి వద్దనే ఇచ్చే వారని లబ్ధిదారులు గుర్తు చేసుకున్నారు.

బనగానపల్లె రూరల్ : పింఛన్ లబ్ధిదారులకు కష్టలు తప్పడంలేదు. జూన్‌కు సంబంధించి మండలంలో మొత్తం 12,683 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రూ.3.79 కోట్ల మంజూరు అయ్యిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. 3083 మంది వృద్ధులు వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. 70 శాతం మందికి పంపిణీ పూర్తి చేశామని, 5వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని ఇన్‌చార్జీ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు.

సన్మానం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాలలో తాగునీరు అందించిన రైతు ఉన్నం కృష్ణ మోహన్ శనివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. వేసవి నేపథ్యంలో బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో నీటి సమస్య నెలకొంది. రెండేళ్లుగా తన పొలంలోని బోరుబావి నుంచి తాగునీరు అందించిన కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రఘుకులోత్తమ్మరావు, వెంకటనారాయణ, రామచంద్రారెడ్డి, రామకృష్ణ, లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, వెంకట సుబ్బయ్య, రాజేంద్ర పాల్గొన్నారు.



కృష్ణ మోహన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రజల సేవలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్

డోన్ టౌన్ : ప్రజల ఆర్థికాభివృద్ధికి పాటుపడేందుకు ఆంధ్ర పగ్రతి గ్రామీణ బ్యాంక్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా సేవలో ముందు ఉందని ఆంధ్ర పగ్రతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జయ అన్నారు. ఆ బ్యాంక్ ఫౌండేషన్ డే పురస్కరించుకొని శనివారం బెస్ట్ కష్టమర్, డిపాజిటర్ అయిన లీగల్ అడ్వైజర్ జోన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి దంపతుల చేతుల మీదుగా కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది,ఖాతాదారులు పాల్గొన్నారు.

8న మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మీ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థులకు సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన ఉంటుందని చెప్పారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

ప్యాపిలి: పట్టణానికి చెందిన బళ్లారి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 2000-01 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మృతుడి మిత్రులు బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకుని చేయూనిచ్చారు. 71 మంది మిత్రులు ఐకమత్యంగా రూ. 72వేలను మృతుని భార్య సుజాత, కుమార్తె జయశ్రీ పేరిట పదేళ్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను శనివారం అందజేశారు. అదేవిధంగా బియ్యం, వంట సరుకులను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉమేశ్ యాదవ్, సాదిక్‌వలి, శ్రీను, పవన్, సుంకన్న, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న మిత్రబృందం

పకడ్బందీగా బందోబస్తు

డోన్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ ఈ నెల 4న నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం నుంచి పట్టణంలో పడడ్బందీగా ముందస్తు బందోబస్తు నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ సహకరించాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపట్టామన్నారు. ఎల్ఐసీ కార్యాలయం, పాత బస్టాండ్, గుత్తి రోడ్డులోని అమ్మా హోటల్, బేతంచెర్ల సర్కిల్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యాలయాలు, అభ్యర్థుల నివాసాలు, సాయి ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా రెండు మోబైల్‌పార్టీలు, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ పార్టీలతోపాటు ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రజల జీవనానికి, ప్రశాంత వాతావరణానికి ఎవ్వరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

కొలిమిగుండ్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ అజ్మతుల్లా సూచించారు. శనివారం ఎంఈఓ అబ్దుల్ కలాంతో కలిసి కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌లో మండంలోని వంట ఏజెన్సీలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గదుల వద్ద తప్పక పరిశుభ్రత పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు వంద శాతం ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఏజెన్సీ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన ఏజెన్సీ మహిళలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది జయలక్ష్మి, కాంతారావు, ఐఈఆర్టీ నూర్‌బాషా, సీఆర్పీ మద్దిలేటి పాల్గొన్నారు.

సామూహిక వాసవీమాత చాలీసా పారాయణం

డోన్ టౌన్ : వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం ఆర్యవైశ్య సంఘం మహిళా సభ్యు లు, వాసవీ మహిళా మండలి సభ్యులు భక్తి శ్రద్ధలతో సామూహిక చాలీసా పారాయణం చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి అమ్మవారిశాల వరకు వాసవీమాత ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో మహిళా భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులకు కన్యాక పూజ, సామూహిక వాసవీ చాలీసా పారాయణం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వరిగడ్డికి భలే గిరాకీ!

సంజామల: వ్యవసాయ రంగంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. కాలానికి అనుగుణంగా సాగు పద్ధతులూ మారిపోతున్నాయి. ఫలితంగా పశువులకు ఎండుగడ్డి కొరత ఏర్పడుతుంది. గతంలో వరిని కోసి ఎద్దులతో నూర్పిడి చేయగా అనంతరం ట్రాక్టర్‌ను వాడారు. ఎండుగడ్డి పుష్కలంగా లభించేది. రైతులు దానిని పశుగ్రాసంగా ఉపయోగించేవారు. ప్రస్తుతం కూలీల రేట్లు, ట్రాక్టర్ బాడుగలు విపరీతంగా పెరిగాయి. దీంతో ఖర్చుతోపాటు సమయం ఎక్కువగా పడుతుంది. వీటిని అధిగమించేందుకు వరి కోత మిషన్‌ను ఎంచుకున్నారు రైతులు. గంటల వ్యవధిలలోనే పనిపూర్తి చేస్తుంది. వ్యయం, సమయం ఆదా అవుతుంటే వీటి వినియోగంపైనే రైతులు మెగ్గుచూపుతున్నారు. యంత్రాల నూర్పిడి మూలంగా వరిగడ్డి ముక్కలై పశుగ్రాసానికి తరలించేందుకు వీలుకావడం లేదు. దీంతో పశుగ్రాస కొరత ఏర్పడుతుంది. మరో వైపు దాన ఖర్చులు తట్టుకోలేక రైతు లు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కొందరు రైతులు మిషన్ ద్వారా కోసిన గడ్డిని యంత్రాల ద్వారా మోపులుగా చుట్టించి పశగ్రాసం సమకూర్చుకుంటున్నారు. మరికొందరు విక్రయిస్తున్నారు. ఒక్కోమోపు రూ.90 నుంచి రూ.120 వరుకు పలుకుతుంది. ఎకరాకు 70 నుంచి 80 వరుకు మోపులు అయ్యే అవకాశం ఉంది. అంటే ఈ లెక్క నా ఎకరాకు దాదాపు రూ.8 వేలు ఖర్చవుతుంది. ట్రాక్టర్ బాడుగ అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. ఇంత ఖర్చు చెల్లిస్తున్నా తగిన గడ్డి లభించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏదిఏమైనా వరిగడ్డికి గిరాకీ పెరిగింది.



వరి గడ్డి కట్టలను బొలొరో ఆటోలో తరలిస్తున్న రైతు(ఫైల్)



కలంలో మోపులుగా చుట్టిన వరిగడ్డి